

తాను మరణించినా.. నలుగురికి ప్రాణదానం

● బ్రెయిన్‌డెడ్ అయిన యువకుడి అవయవాలు దానం

7

మూడు నెలలు ముప్పు తిప్పలు








నిరుపేదలకు పూట గడవాలంటే రేషన్ బియ్యమే ఆధారం. ఇప్పుడు ఆ రేషన్‌బియ్యం తీసుకోవడానికి లబ్ధిదారులు అవస్థలు పడుతున్నారు. మూడునెలల రేషన్ ఒక్కసారే ఇస్తుండటంతో బియ్యం కోసం గంటల తరబడి పడిగాపులు తప్పడం లేదు. దుబ్బాకలో ఒక కార్డు లబ్ధిదారుడు తన రేషన్‌బియ్యం తీసుకోవడానికి రెండురోజులు పడిగాపులు తప్పడం లేదు. ఇదంతా ఒకెత్తు అయితే మూడు నెలల రేషన్ తీసుకెళ్లడం తలకు మించిన భారంగా మారింది. దుబ్బాక పట్టణానికి డబుల్‌బెడ్‌రూం ఇళ్లు దూరంగా ఉండడంతో వారంతా ఆటోల్లో వచ్చి తీసుకుని వెళ్తున్నారు. ఇంకొందరు కొంతమందికి సైకిళ్లమీద, ద్విచక్రవాహనాలమీద సర్కాస్ ఫీట్లు తప్పలేదు. వ్యవసాయ పనులు మానుకుని పొద్దంగా రేషన్‌దుకాణాల వద్ద పడిగాపులు కాస్తున్నారు.

- దుబ్బాక, జూన్3 (ఆంధ్రజ్యోతి)









హుస్నాబాద్‌లో పశువుల అంగడి

ఎడ్లు లేని ఎవుసం..

ఒకప్పుడు ఎడ్లు లేని వ్యవసాయం లేదు. పశువులు లేని ఇల్లంటూ ఉండేది కాదు.. గొడ్ల మందలు లేని గ్రామాలు లేవు. తెల్లవారు జామునే పశువులను తోలుకుని రైతులు పొలాలకు పోయేవారు.. ఒకేసారి పది వరకు ఎడ్లకు నాగళ్లు కట్టి పొలాలను దున్నేవారు. వరి కోత పూర్తయ్యాక కల్లాల్లో ఎడ్లతో తిప్పి ధాన్యాన్ని ఎడ్లబండ్లలో ఇళ్లకు తరలించేవారు. నేడు యాంత్రీకరణకు తోడు పోషణ భారమై పశుసంపద తగ్గుతుంది. ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం కూడా కరువైంది. నాడు వ్యవసాయంలో ప్రధాన పాత్ర పోషించగా నేడు పంట పొలాల్లో ట్రాక్టర్లు తప్ప పశువులే కనిపించడం లేదు. పవర్ టిల్లర్లు, హార్వెస్టర్లు రావడంతో ఇంకా యాంత్రీకరణ విస్తరించింది. ముఖ్యంగా కూలీల కొరత కారణంగా రైతులు యంత్రాలపై ఆధారపడుతున్నారు. ఇదే కాకుండా కరువు కాలంలో పశువుల పోషణ రైతులకు భారంగా మారింది. పశుగ్రాసం తేలేక ఉన్న పశువులను కబేళాలకు విక్రయిస్తున్నారు.

- హుస్నాబాద్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి)

● పెరుగుతున్న యాంత్రీకరణ.. తగ్గుతున్న ఎడ్ల పాత్ర ● ప్రమాదస్థాయికి పశుసంపద
● పోషణ భారమై హుస్నాబాద్ వార సంత నుంచి 400లకు పైగా పశువులు కబేళాలకు

రైతులు యంత్రాలపై ఆధారపడడంతో ప్రతీ గ్రామంలో హార్వెస్టర్లు, ట్రాక్టర్లు పదుల సంఖ్యలో ఉంటున్నాయి. వ్యవసాయంలో ఆధునీకరణ, యాంత్రీకరణను తప్పుపట్టకున్నా కనీసం ఎడ్లజాతిని రక్షించుకోవడానికి ప్రభుత్వాలు రైతులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది.

80 శాతం యంత్రాలతో సాగు..

80 శాతం మందికి పైగా రైతులు యంత్రాలతో సాగు చేస్తున్నారు. మిగిలిన 20శాతం మంది చిన్నచిన్న వ్యవసాయ పనులకు ఎడ్లను వినియోగిస్తున్నారు.

తగ్గిపోయిన పెంపకం

ఎడ్లధర, పోషణ భారంగా మారడంతో వీటి పెంపకంపై రైతులు ఆసక్తి చూపడం లేదు. గేదెలు ఇచ్చినన్ని పాలు ఆవులు ఇవ్వకపోవడంతో వీటిని పెంచేందుకు రైతులు ముందుకు రావడం లేదు. ఇది ఎడ్ల ఉత్పత్తిపై ప్రభావం చూపుతుంది. ఎడ్లను కొనుగోలు చేయాలన్న వీటి ధరలు చుక్కలంటుతున్నాయి. మామూలు ఎడ్ల జత రూ.75 వేల పైన ఉన్నాయి. మంచి జత కావాలంటే రూ. 1.50 లక్షలు వెచ్చించినా లభించడం లేదు. దీంతో వీటిని కొనుగోలు చేసేందుకు రైతులు వెనుకంజ వేస్తున్నారు.

దూడలూ కబేళాలకు..

దూడలు పెరిగితేనే ఎడ్లు అవుతాయి. ఆవులు పాలు ఇచ్చే వరకు ఉంచుకొని తరువాత పోషణ భారమై కబేళాలకు తరలుతున్నాయి. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో కృత్రిమ గర్భధారణ కేంద్రాలు ఏర్పాటు చేశారు. హుస్నాబాద్, అక్కన్నపేట మండలాల్లోని పందిల్ల, పోతారం(ఎస్), రామవరం, గోవర్ధనగిరి, మల్లంపల్లి, గౌరవెల్లి, అక్కన్నపేట పశువైద్య కేంద్రాల్లో కృత్రిమ గర్భధారణ కేంద్రాలున్నాయి. ఒక్కో కేంద్రంలో పశువులకు 300 నుంచి 400 వరకు కృత్రిమ గర్భధారణ చేస్తున్నారు. జెర్సీ హెచ్ఎఫ్, క్రాస్ జెర్సీ ఒంగోలు లాంటి సంకర జాతులను ఉత్పత్తి చేస్తున్నారు. ఇవి పాడికి పనికి వస్తాయి కానీ మగ దూడలు మాత్రం వ్యవసాయ పనులకు ఉపయోగపడవు. కృతిమ గర్భధారణలో జెర్సీ, హెచ్ఎఫ్, జెర్సీ క్రాస్ లాంటి సంకర జాతికి బదులు శాయివన్ జెర్సీ లాంటి జాతులను ఉత్పత్తి చేస్తే మగదూడలు ఎడ్లుగా మారి కొంత వరకైనా వ్యవసాయానికి ఉపయోగపడుతాయి.



హార్వెస్టర్‌తో వరికోత

జిల్లాలో తగ్గుతున్న పశువుల సంఖ్య

జిల్లాలో పశువుల సంఖ్య నానాటికి తగ్గిపోతుంది. 2012 లో జరిగిన పశుగణనలో ఆవులు, ఎడ్లు, లేగదూడలు, 1,63,578 ఉన్నాయి. గేదెలు, దున్నపోతులు, దుడ్డెలు 1,67,387 ఉన్నాయి. వీటి సంఖ్య 70 శాతం వరకు తగ్గిపోయిందని, ఇందులో పాడికి పనికి వచ్చే ఆవుల కంటే ఎడ్ల సంఖ్య గణనీయంగా తగ్గిపోయినట్లు సంబంధిత

మిగతా 8వ పేజీలో

అమ్మో.. జూన్

● ఖర్చుల దరువు..బతుకు బరువు
● వ్యవసాయానికి పెట్టుబడులు, స్కూళ్లు, కాలేజీల ఫీజులు
● మధ్య తరగతి కుటుంబాలపై ఆర్థిక భారం

దౌల్తాబాద్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): జూన్ మాసం వచ్చిందంటే చాలు జనం భయపడుతున్నారు. ఓ వైపు వ్యవసాయానికి పెట్టుబడి, మరోవైపు పిల్లల స్కూలు ఫీజులు, పుస్తకాలతో ఖర్చులు తడిసిమోపెడవుతున్నాయి.

అన్నదాత పరిస్థితి ఆగం..

సీజన్ ప్రారంభం కావడంతో రైతులు వ్యవసాయభూములను చదును చేయడం, దుక్కులు దున్నడం, విత్తనాలు, ఎరువులకు పెద్దమొత్తంలో ఖర్చు చేయాల్సి వస్తుంది. ఇప్పటికే పలువురు విత్తనాలు కొనుగోళ్లను ప్రారంభించారు. ఎకరాకు కనీసం రూ.30వేల పెట్టుబడి అవసరం ఉంటుంది. ఐదు ఎకరాలు ఉన్న రైతులు దాదాపు రూ.లక్షకు పైగా డబ్బు పెట్టుబడిగా పెట్టాల్సి ఉంటుంది. ప్రభుత్వం రైతు భరోసా కింద పెట్టుబడి సాయం అందిస్తున్నా అది సరైనా సమయానికి చేతికి అందడం లేదు. బ్యాంకు రుణాలు సైతం అవసరానికి అందడం లేదు. రైతులు బ్యాంకులను, ప్రైవేట్ వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు.



దౌల్తాబాద్ మండల కేంద్రంలో ఓ షాపులో విత్తనాలు కొనుగోలు చేస్తున్న రైతులు

ఫీ'జులుం'

గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పాఠశాలల్లో ఫీజులు కొంచెం తక్కువ మొత్తంలో ఉండగా, పట్టణ ప్రాంతాల్లో మాత్రం ఎక్కువ మొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్నారు. ప్రీప్రైమరీ తరగతులకు రూ.25వేలకు పైగా ఫీజులు వసూలు చేస్తున్నారు. యేటా 10 నుంచి 20 శాతం మేర ఫీజులు పెంచుతుండడంతో తల్లిదండ్రులపై భారం తప్పడం లేదు. వీటికి తోడు పుస్తకాలు, స్కూలు యూనిఫాంలు, బ్యాగులు, స్టడీ మెటీరియల్స్ తదితర ఖర్చులతో తల్లడిల్లుతున్నారు. ప్రైవేట్ ఉద్యోగులు, చిరు వ్యాపారులపై బడి ఫీజుల భారం మరింత ఎక్కువగా కనిపిస్తుంది.



రూ.10కోట్ల గంజాయి, డ్రగ్స్ దహనం

సంగారెడ్డి క్రైం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లాలోని నాలుగు ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో 27 కేసుల్లో పట్టుబడిన గంజాయి, అల్ప్రోజోలం, డైజోఫాం వంటి మత్తు పదార్థాలను మంగళవారం నాడు ఇస్నాపూర్‌లోని మెడికేర్ వెస్టేజ్ మేనేజ్‌మెంట్‌లో దహనం చేశారు. మెదక్ డిప్యూటీ కమిషనర్ జె.హరికిషన్ డిస్పోజల్ అధికారిగా వ్యవహరించారు. పటాన్‌చెరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో పది కేసులు, సంగారెడ్డి పరిధిలో ఏడు, నారాయణఖేడ్‌లో మూడు, అందోల్‌లో నాలుగు కేసుల్లో ఈ గంజాయి, డ్రగ్స్‌ను ఎక్సైజ్ పోలీసులు గతంలో పట్టుకున్నారు. 209.162 కిలోల గంజాయి, ఏడు గ్రాముల డైజోఫాం, 0.496 కిలోల అల్ప్రోజోలం తదితర మత్తు పదార్థాలను దహనం చేసినట్లు సంగారెడ్డి ఎక్సైజ్ సూపరింటెండెంట్ నవీన్‌చంద్ తెలిపారు. వీటి విలువ సుమారు రూ.10.11 కోట్లు వుంటుందని అన్నారు.





కొండపాక మండలం దుద్దెడ రైతువేదికలో విత్తనాలను అందజేస్తున్న అధికారులు

విత్తనోత్పత్తికి ప్రోత్సాహం

7

● ఉత్సాహంగా 'నాణ్యమైన విత్తనం-రైతన్నకు నేస్తం'

ప్రమాదాల దారి.. పట్టించుకునేవారేరీ?

8

● సూచిక బోర్డులు లేవు.. స్పీడ్ బ్రేకర్ల ఊసే లేదు
● హుస్నాబాద్‌లోని స్తూపం ఏనే వద్ద ప్రమాదాలు

సిద్దిపేట బంద్ ప్రశాంతం

8

● స్వచ్ఛందంగా బంద్ చేసిన వ్యాపారులు
● పట్టణంలో పర్యటించిన సీపీ అనురాధ



తరలివస్తున్న భక్తజనం

● మరో ఎనిమిది రోజుల్లో రేణుకా ఎల్లమ్మ జాతర

హుస్నాబాద్‌లోని రేణుకా ఎల్లమ్మ జాతరకు మరో ఎనిమిది రోజులు మాత్రమే ఉండడంతో అమ్మవారి దర్శనం కోసం భక్తులు తరలివస్తున్నారు. మంగళవారం ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. బోనాలు, పట్నాలు, ఒడిబియ్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ నెల 11తో జాతర ముగియనుం ది. ఆది, మంగళ, శుక్రవారాల్లో భారీగా వస్తున్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈవో కిషన్‌రావు తెలిపారు.

- హుస్నాబాద్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి)



అమ్మవారిని దర్శించుకోవడానికి క్యూలో ఉన్న భక్తులు



అమ్మవారికి పట్నాలు వేస్తున్న భక్తులు

భూ భారతితో సమస్యలు పరిష్కారం

● కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట అర్బన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలు చేస్తున్న భూ భారతి చట్టం వల్ల భూ సంబంధిత సమస్యలు పరిష్కారం అవుతాయని కలెక్టర్ మనుచౌదరి తెలిపారు. మంగళవారం సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాలలో నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సులో దరఖాస్తుల స్వీకరణను పరిశీలించి, మాట్లాడారు. భూ సమస్యలను పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. నేటి నుంచి జూన్ 20 వరకు రెవెన్యూ సదస్సులు జరుగుతాయని వెల్లడించారు. సదస్సుల్లో పాల్గొన్న ప్రజల భూములకు సంబంధించిన సమస్యలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. రెవెన్యూ అధికారులు ప్రజల దరఖాస్తులను స్వీకరించి, వెంటనే రసీదులు ఇవ్వాలని ఆదేశించారు. సకాలంలో సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమాల్లో తహసీల్దార్ హరికిరణ్, డిప్యూటీ తహసీల్దార్ ఉదయశ్రీ, ఆర్ఐలు బాలయ్య, సంజీవ్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

కుకునూరుపల్లి/కొడిపల్లి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడిమెదక్ జిల్లాలో మంగళవారం చోటు చేసుకున్న రెండు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. సిద్దిపేట జిల్లా కుకునూరుపల్లిలో రోడ్డు దాటుతున్న ఓ మహిళను బైక్ వేగంగా ఢీకొట్టడంతో మృతి చెందింది. మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం దేవులతండా సమీపంలో ఓ రైతు పొలానికి నీరు పెట్టేందు కోసం రోడ్డు దాటుతుండగా కారు ఢీకొని అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. రెండు ఘటనలు రోడ్డుదాటుతున్న క్రమంలోనే చోటు చేసుకోవడం గమనార్హం.



మృతి చెందిన మంజమ్మ

● కుకునూరుపల్లి ఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. కుకునూరుపల్లి మండలం మంగోల్ గ్రామానికి చెందిన లగిశెట్టి మంజమ్మ(50) గిర్నిలో కారంపొడి పట్టించుకుందామని మంగళవారం మధ్యాహ్నం కుకునూరుపల్లికి వచ్చింది. ఈ క్రమంలో బొబ్బాయిపల్లి వైపు ఉన్న గిర్ని వైపు వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ నుంచి కరీంనగర్ వైపునకు వెళ్తున్న ద్విచక్రవాహనదారుడు అతి వేగంగా వచ్చి మంగమ్మను ఢీకొట్టడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. మోటార్ సైకిల్ నడుపుతున్న వ్యక్తి కరీంనగర్ పోలీస్ విభాగంలో ఏఆర్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నట్లు సమాచారం. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్టు ఎస్ఐ తెలిపారు.



రమేష్(ఫైల్)

● కౌడిపల్లి మండలంలో సోమవారం రాత్రి చోటు చేసుకున్న మరో ఘటనకు సంబంధించి కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలపరిధిలోని దేవుల తండాకు చెందిన లకవత్ రమేష్ పొలం జాతీయ రహదారి 765డికి ఆవలి వైపు ఉండటంతో రాత్రి 9 గంటల ప్రాంతంలో పొలానికి నీరు పెట్టేందుకు బయలుదేరాడు. ఈ క్రమంలో రోడ్డుదాటుతుండగా మెదక్ వైపు నుంచి నర్సాపూర్‌కు వేగంగా వస్తున్న కారు రమేష్‌ను బలంగా ఢీ కొనడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య నీల ఫిర్యాదు మేరకు ఎస్ఐ రంజిత్ రెడ్డి కేసు దర్యాప్తు చేపట్టారు.

గుండెపోటుతో నవ వరుడు మృతి



సాయికిరణ్(ఫైల్)

కొల్చారం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): నవవరుడు మృతి చెందిన సంఘటన మెదక్ జిల్లా కొల్చారం మండలం అంసానిపల్లి గ్రామంలో సోమవారం రాత్రి చోటు చేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం అంసాన్‌పల్లి గ్రామానికి చెందిన అక్కమొల్ల పెద్ద వెంకట్ లక్ష్మి దంపతుల కుమారుడు అక్కమొల్ల సాయికిరణ్ (19) అలియాస్ చింటుకు గత నెల 21న అంసానిపల్లి గ్రామానికి చెందిన గోల్పల శేఖర్ రుక్కమ్మల కూతురు అనూషతో వివాహం జరిగింది. పెళ్లి జరిగిన 14 రోజుల్లోనే సాయికిరణ్ గుండెపోటుతో మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.. మృతుడు పెయింటర్ పని చేస్తూ జీవిస్తున్నాడు. సోమవారం రాత్రి గ్రామంలో ఓ వివాహానికి బ్యాండ్ కొట్టడానికి వెళ్లి ఉదయం వచ్చాడు. అనంతరం స్నానం కోసం వెళ్లి బాత్రూంలోనే పడిపోయాడు. కుటుంబ సభ్యులు గమనించేసరికే అతడు మృతి చెందాడు. నవవరుడి మృతితో ఆ కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

క్రైం కార్నర్

తాను మరణించినా.. నలుగురికి ప్రాణదానం

● బ్రెయిన్‌డెడ్ అయిన యువకుడి అవయవాలు దానం


వెంకటేశ్ (ఫైల్)

చిన్నకోడూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : బ్రెయిన్‌డెడ్ అయిన యువకుడి అవయవాలను అతడి కుటుంబ సభ్యులు దానం చేసి ఆదర్శంగా నిలిచారు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నకోడూరు మండలం చంద్లాపూర్‌కు చెందిన పెద్దోల్ల ఐలయ్య లలిత దంపతుల పెద్ద కుమారుడు వెంకటేశ్ (21) సిద్దిపేటలోని ఓ కళాశాలలో డిగ్రీ చదువుకుంటూ తల్లిదండ్రులకు వ్యవసాయ పనుల్లో చేదోడువాదోడుగా ఉంటున్నాడు. గత నెల 30న రాత్రి గ్రామంలో వెంకటేశ్ ప్రమాదవశాత్తు జారి కింద పడడంతో తలకు తీవ్ర గాయాలై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. వెంటనే కుటుంబ సభ్యులు అతడిని సిద్దిపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు అక్కడి నుంచి హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. బ్రెయిన్‌డెడ్ అయినట్లు తెలిపిన వైద్యులు అవయదానంపై యువకుడి కుటుంబ సభ్యులకు వివరించడంతో అందుకు వారు అంగీకరించారు. ఈ మేరకు మంగళవారం (గుండె, కిడ్నీలు, ఊపిరితిత్తులు, కాలేయం) అవయవాలను సేకరించారు. అనంతరం చంద్లాపూర్‌లో యువకుడి అంత్యక్రియలు జరిగాయి.

కుటుంబ కలహాలతో దంపతుల ఆత్మహత్య


బేగరి రమేశ్ (ఫైల్)


బేగరి అనిత (ఫైల్)

మునిపల్లి, జూన్ 3(ఆంధ్రజ్యోతి) : కుటుంబ కలహాలతో భార్యాభర్తలు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలంలోని పెద్దగోపులారం గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. మునిపల్లి ఎస్‌ఐ రాజేశ్‌నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దగోపులారం గ్రామానికి చెందిన బేగరి రమేశ్(40), కోహీర్ మండలం బిలాల్‌పూర్ గ్రామానికి చెందిన బేగరి అనిత(30)ను గత 13 ఏళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్న ఈ దంపతులకు అర్చన(13), అనురాధ(8), శ్రీనాథ్(5) ముగ్గురు సంతానం. కాగా రమేశ్ భార్య అనితపై అనుమానంతో గత మూడు నెలల నుంచి గొడవలు జరుగుతున్నాయి. మంగళవారం అర్ధరాత్రి సమయంలో దంపతుల మధ్య ఏం జరిగిందో కానీ ఇంట్లో ఐరన్‌రాడ్‌కు చున్నీతో అనిత, అదే రాడ్‌కు తాడుతో రమేశ్ ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ విషయాన్ని స్థానిక పోలీసులకు సమాచారం అందించడంతో వెంటనే సంఘటన స్థలాన్ని సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్యగౌడ్‌తో పాటు కొండాపూర్ సీఐ వెంకటేశం, మునిపల్లి ఎస్‌ఐ రాజేశ్‌నాయక్, సిబ్బందితో కలిసి చేరుకుని అక్కడి పరిస్థితులను పరిశీలించారు. దంపతుల ఆత్మహత్యకు గల కారణాలపై ఆరా తీశారు. మృతుల బంధువులు గుడిపల్లి నర్సింలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు మునిపల్లి ఎస్‌ఐ రాజేశ్‌నాయక్ తెలిపారు. తల్లిదండ్రులు మృతితో ముగ్గురు పిల్లలు అనాథలయ్యారు.

మరో ఘటనలో యువకుడు..


శ్రీకాంత్ (ఫైల్)

కొడిపల్లి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో వ్యక్తి పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని రాజిపేట్ గ్రామానికి చెందిన బాంచె శ్రీకాంత్ (31)కు భార్య స్వాతితో కొంత కాలంగా కుటుంబ కలహాల కారణంగా గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో స్వాతి శివ్వంపేట మండలం గంగాయిపల్లిలోని పుట్టింటికి పది హేను రోజుల క్రితం వెళ్లింది. తీసుకొచ్చేందుకు భర్త వెళ్లినా రాకపోవడంతో మనస్తాపానికి గురైన శ్రీకాంత్ ఈ నెల 1న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేయగా, కుటుంబీకులు ఉస్మానియా అనుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ముగ్గురిపై ఎస్సీ ఎస్టీ కేసు

మనోహరాబాద్ జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మనోహరాబాద్ గ్రామానికి చెందిన ముగ్గురు యువకులపై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ పేర్కొన్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. పర్కిబండ గ్రామానికి చెందిన బుర్రి ఉదయ్ ఈ నెల 1న పని నిమిత్తం మనోహరాబాద్‌కు వెళ్లాడు. అక్కడ స్థానిక యువకుల మధ్య గొడవ జరగగా అడ్డు వచ్చిన ఉదయ్, అతడి తండ్రి నర్సింహులు, బాబాయ్ రమేష్‌ను మనోహరాబాద్‌కు చెందిన యువకులు మహేష్, కిట్టు, స్వామి కులం పేరుతో దూషిస్తూ దాడి చేశారు. ఈ ఘటనపై విచారణ చేసిన పోలీసులు మహేష్, కిట్టు, స్వామిపై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేశారు. ఈ దాడిని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి శంకర్, మెదక్ జిల్లా డీబీఎఫ్ అధ్యక్షుడు సంజీవ్, పర్కిబండలో బుర్రి నర్సింహులు ఖండిస్తూ కుటుంబ సభ్యులను పరామర్శించారు. దళితులపై దాడి చేసి కులం పేరుతో దూషించినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

చోరీ కేసులో ఐదుగురి అరెస్ట్


నిందితులను చూపుతున్న సీఐ అనిల్ కుమార్

జోగిపేట రూరల్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): దినసరి కూలీలపై దాడి చేసిన ఐదుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. మంగళవారం సీఐ అనిల్ కుమార్ జోగిపేటలోని తన కార్యాలయంలో ఈ కేసు వివరాలను వెల్లడించారు. ఉత్తర ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన రవినేష్ కుమార్, అమర్‌పాల్ మండలంలోని అల్మాయిపేటలో నివాసముంటూ ఒక సీసీల కంపెనీలో పనిచేస్తున్నారు. గత నెల 28న వారిద్దరూ జోగిపేటకు వచ్చి మెడికల్ షాప్‌లో మందులు తీసుకుని తిరుగు ప్రయాణంలో ఆటోలో వెళ్తున్నారు. ఇది గమనించిన... చౌటకూరు మండలం శివంపేటకు చెందిన ఆటో డ్రైవర్ వడ్డె శ్రీకాంత్, గొలుసుల కుమార్, ఉప్పు సాయికుమార్, కుల్చారం మండలం రంగంపేటకు చెందిన ద్యారంగుల అనిల్, మక్కని నవీన్ జాతీయ రహదారిపై గల సంగుపేట అండర్ పాస్ నుంచి ఆటోను మాసాన్‌పల్లి వైపు ఒక నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లారు. వారిద్దరిపై దాడి చేసి వారి నుంచి కొంత నగదుతోపాటు రెండు సెల్ ఫోన్లను చోరీ చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు మంగళవారం ఉదయం స్థానిక అంబేడ్కర్ కూడలి వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా.. అనుమానాస్పదంగా కనిపించిన ఆటో డ్రైవర్ వడ్డె శ్రీకాంత్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని ఒప్పుకున్నాడు. ఈ మేరకు వడ్డె శ్రీకాంత్‌తోపాటు వడ్డె గొలుసు కుమార్, ద్యారంగుల అనిల్, ఉప్పు సాయికుమార్, మక్కని నవీన్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలిచించినట్టు సీఐ తెలిపారు.

కారు, బైక్ ఢీ.. ఒకరి మృతి


నరేందర్ (ఫైల్)

రాయపోల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కారు, బైక్ ఢీకొని యువకుడు మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. దౌల్తాబాద్‌కు చెందిన జిర్కపల్లి నరేందర్(22) కుకునూరుపల్లిలో ఫ్లెక్సీ షాపు నిర్వహిస్తున్నాడు. రోజు మాదిరిగానే మంగళవారం రాత్రి షాప్ బంద్ చేసి బైక్‌పై దౌల్తాబాద్ వెళ్తుండగా గజ్వేల్ వైపు వెళ్తున్న కారు ఢీకొన్నది. గాయపడిన నరేందర్‌ను పోలీసు వారి వాహనంలో గజ్వేల్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడు.


వెల్దుర్తి రైతు వేదికలో విత్తనాలు పంపిణీ చేస్తున్న అధికారులు


జహీరాబాద్ : రంజోల్‌లో రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న వ్యవసాయశాఖ ఏడీఏ భిక్షపతి, తదితరులు

విత్తనోత్పత్తికి ప్రోత్సాహం

● ఉత్సాహంగా 'నాణ్యమైన విత్తనం-రైతన్నకు నేస్తం' ● ఊరూరా రైతులకు మూల విత్తనాల అందజేత

గ్రామ స్థాయిలో విత్తనోత్పత్తిని ప్రోత్సహించి.. రైతులకు మేలు రకమైన విత్తనాలను అందించాలన్న ముఖ్య ఉద్దేశంతో ప్రభుత్వం 'నాణ్యమైన విత్తనం- రైతన్నకు నేస్తం' అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా వ్యవసాయ శాఖ ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం సౌజన్యంతో 'విత్తుకొద్దీ పంట' పేరుతో ప్రతీ గ్రామంలో ముగ్గురు రైతులను ఎంపిక చేసి వంద శాతం సబ్సిడీపై మూల విత్తనాలు అందజేస్తున్నది. మంగళవారం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా విత్తనాల పంపిణీని పండగలా నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, వ్యవసాయ అధికారులు, నాయకులు పాల్గొని సన్న రకం వరి, పెసర, కంది తదితర మూల విత్తనాలను రైతులకు అందజేశారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు, నిపుణులు పాల్గొని అన్నదాతలకు పంటల సాగుపై అవగాహన కల్పించారు.

-న్యూస్ నెట్‌వర్క్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి)

● కొండపాక మండలం దుద్దెడ రైతు వేదికలో లోని 11 రెవెన్యూ గ్రామాల రైతులకు ఏఎంసీ కొండపాక వైస్ చైర్మన్ పరుశరాములు, వ్యవసాయ అధికారి శివరామకృష్ణ విత్తనాలను అందజేశారు.

● నారాయణఖేడ్ మండల పరిధిలోని జూకల్ శివారులో రైతు వేదికలో ఎమ్మెల్యే సంజీవరెడ్డి హాజరై విత్తన బస్తాలను పంపిణీ చేశారు. ఖేడ్ డివిజన్‌లో 113 మందికి విత్తనాలను అందించారు.

● సదాశివపేట మండలం మద్దికుంట గ్రామంలోని రైతు వేదికలో సీడీసీ చైర్మన్ గడీల రాంరెడ్డి హాజరై రైతులకు విత్తనాలను అందజేశారు. అనంతరం జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్, వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ చంద్రశేఖర్ సాగు సమయంలో పాటించాల్సిన మెళకువలను వివరించారు.


ములుగులో రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న అధికారులు

● కల్హేర్, సిర్గాపూర్ రైతు వేదికల్లో జరిగిన కార్యక్రమంలో కల్హేర్, సిర్గాపూర్ మండలాల వ్యవసాయ అధికారులు వెంకటేశం, హరిక్రిష్ణ, వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు చరిత్‌కుమార్, హరి పాల్గొని రైతులను విత్తనాలను అందజేశారు.

● జహీరాబాద్ పట్టణంలోని రంజోల్ రైతువేదికలో వ్యవసాయశాఖ ఏడీఏ భిక్షపతి, శాస్త్రవేత్త విజయ్‌కుమార్ రైతులకు విత్తనాలను పంపిణీ చేశారు. జహీరాబాద్ మండలానికి 59 విత్తనాల కిట్లను కేటాయించినట్లు అధికారులు తెలిపారు.

● ఝరాసంగం మండల పరిధిలోని బర్దీపూర్ రైతు వేదికలో వ్యవసాయ శాఖ ప్రొఫెసర్ జయశంకర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ సతీష్, మండల వ్యవసాయ శాఖ అధికారి వెంకటేశం విత్తనాలను అందజేశారు.

● అల్లాదుర్గం మండలం చేవెళ్ల గ్రామంలోని రైతు వేదికలో పీజేటీఏయూ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త పద్మశ్రీ రైతులకు విత్తనాలు అందజేశారు.

● పెద్దశంకరంపేట రైతు వేదికలో రాజేంద్రనగర్ యూనివర్సిటీ శాస్త్రవేత్త చైతన్య, మండల వ్యవసాయాధికారి నాగం కృష్ణ విత్తనాలను అందజేశారు.

● వెల్దుర్తి రైతు వేదికలో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్త లక్ష్మిప్రసన్న అధికారులతో విత్తనాలు పంపిణీ చేశారు.

● చేగుంట మండలంలో ఆయా గ్రామాల రైతులకు వ్యవసాయ అధికారి హరిప్రసాద్, మానిటరింగ్ అధికారి శాస్త్రవేత్త చైతన్య విత్తనాలు అందజేశారు.

● రేగోడు రైతు వేదికలో మండల వ్యవసాయ అధికారి జావిద్ పాల్గొని విత్తనాలు అందజేశారు.

● హవేళిఘణపూర్ మండల కేంద్రంలోని రైతువేదిక ఏడీఏ విజయనిర్మల, శాస్త్రవేత్త జెనిమా తదితరులతో కలిసి రైతులకు విత్తనాలు అందజేశారు.

● పాపన్నపేట మండల పరిధి మల్లంపేట రైతు వేదికలో జయశంకర్ వ్యవసాయ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.నిర్మల, మండల వ్యవసాయాధికారి నాగమాధురి విత్తనాలను అందజేశారు. మొత్తం 32 మందికి పంపిణీ చేశారు.

● జగదేవ్‌పూర్ రైతువేదికలో మండల వ్యవసాయ అధికారి వసంతరావు అందజేశారు.

● కుకునూరుపల్లి రైతువేదికలో శాస్త్రవేత్త చిరంజీవి విత్తనాలను అందజేశారు.

● కోహెడ మండల కేంద్రంలో వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్త డాక్టర్ శ్రీజయ ఏవో సతీష్, మార్కెట్ కమిటీ చైర్మన్ బోయిని నిర్మల జయరాజుతో కలిసి రైతులకు విత్తనాలను పంపిణీ చేశారు.

● మద్దూరు మండలకేంద్రంలోని రైతువేదికలో ఏవో రామకృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తొర్నాల వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త ఎ. సతీష్ పాల్గొని విత్తనాలు అందజేశారు.

● సిద్దిపేట రూరల్ : ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త పల్లవి చిన్నకోడూరు, నారాయణరావుపేట మండలాల్లోని 70 మందికి విత్తనాలు అందజేశారు.

● గజ్వేల్ పట్టణంలోని రైతు వేదికలో జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరి యాదవరెడ్డి హాజరై విత్తనాలు అందజేశారు.

● కొమురవెల్లి మండలంలోని మర్రిముస్త్యాల గ్రామ రైతు వేదికలో రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్త డా.మహ్మద్ ఆలీబాబా, మండల వ్యవసాయ అధికారి వెంకట్రావమ్మ పంపిణీ చేశారు.

● దుబ్బాక దుబ్బాక రైతు వేదికలో వ్యవసాయాధికారి ప్రవీణ్ వ్యవసాయ శాస్త్రవేత్త ఎల్లాగౌడ్‌తో కలిసి రైతులకు విత్తనాలను అందజేశారు.

● వర్గల్ రైతు వేదికలో వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ ప్రమీల విత్తనాలను అందజేశారు.

● హుస్నాబాద్‌రూరల్ : హుస్నాబాద్ రైతు వేదిక కార్యాలయంలో మండల వ్యవసాయ అధికారి శ్రేయ, శాస్త్రవేత్త ఎల్ రాజా ఎంపిణీ చేశారు.

● చేర్యాల పట్టణంలోని రైతువేదికలో జిల్లా వ్యవసాయాధికారి రాధిక, కృషి విజ్ఞానకేంద్రం, మెట్ట పరిశోధనకేంద్రం శాస్త్రవేత్తలు అలీబాబా, శాలిని రైతులకు విత్తనాలు, సీడ్ డ్రిల్ అందజేశారు.

● మర్కుక్ రైతువేదికలో విత్తనాలు అందించారు.

పట్టు ఉత్పత్తిలో సిద్దిపేట జిల్లా మొదటి స్థానం

● పట్టు పరిశ్రమ శాఖ ఇంద్రసేనారెడ్డి


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీ ఇంద్రసేనారెడ్డి

రాయపోల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): పట్టు గూళ్ల ఉత్పత్తిలో సిద్దిపేట జిల్లా రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో ఉందని ఏడీ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం రాయపోల్‌లో పట్టు పరిశ్రమ సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మల్బరి తోట, పట్టు పురుగుల పెంపకం చెపట్టే రైతులకు ప్రభుత్వం నుంచి అన్ని రకాల సబ్సిడీలు అందుతాయని పేర్కొన్నారు. పట్టు పురుగుల పెంపకం చేపట్టే రైతులు ఎకరం మల్బరీ తోట సాగు చేస్తే ఏడాదికి రెండున్నర లక్షల నుంచి మూడున్నర లక్షల రూపాయల వరకు నికర ఆదాయం లభిస్తుందని తెలిపారు. సిద్దిపేట జిల్లాలో 43 కుటుంబాలు 1,127 ఎకరాల్లో మల్బరీ సాగు చేస్తున్నాయని స్పష్టం చేశారు. వారంతా ఆర్థికంగా స్థిరపడుతున్నారని అన్నారు. మల్బరీ తోట బహువార్షిక పంట అని, తక్కువ నీటితో ఎక్కువ సాగు చేసి అధిక లాభాలు పొందవచ్చునని పేర్కొన్నారు. ఒక్కసారి మల్బరీ తోట నాటితే 15 నుంచి 20 సంవత్సరాల వరకు పట్టు పురుగుల మేత కోసం మల్బరీ ఆకులు లభిస్తాయని అన్నారు. మల్బరీ తోట అన్ని రకాల వాతావరణాలను తట్టుకొని పెరుగుతుందని పేర్కొన్నారు. పట్టు పురుగుల సాగుపై దృష్టిపెట్టాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సెరీకల్చర్ ఆఫీసర్ మల్లేశం, పంచాయతీ కార్యదర్శి శివకుమార్, రైతులు పాల్గొన్నారు.

విద్యకు చిన్నారులు దూరం

● ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలకు నోచుకోని కాజీపల్లి కాలనీ
● గ్రామానికి 3 కిలోమీటర్ల దూరంలో కాలనీ
● వెయ్యికి పైగా నివాసాలు.. వందల్లో చిన్నారులు
● గతేడాది పరిశీలించిన కలెక్టర్, డీఈవోలు
● పాఠశాల ఏర్పాటుకు ఎకరా స్థలం కేటాయించేందుకు ప్రతిపాదనలు
● నేటికీ మంజూరు కాని స్థలం


కాజీపల్లి కాలనీ ముఖచిత్రం

జిన్నారం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ చిన్నారి విద్యను హక్కుగా పొందాలనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విద్యా హక్కు చట్టం సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలంలోని కాజీపల్లి కాలనీ నోచుకోవడం లేదు. గ్రామపంచాయతీ కాజీపల్లి గ్రామానికి దూరంగా వెలసిన కాలనీలో వెయ్యికి పైగా నివాసాలు, మూడువేల జనాభా, వందల సంఖ్యలో చిన్నారులు ఉన్నా అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాల లేక చాలామంది చిన్నారులు విద్యకు దూరంగా ఉంటున్నారు. గతేడాది కాలనీలో పర్యటించిన జిల్లాస్థాయి అధికారులు స్థానికంగా పాఠశాల ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీలు నేటికీ నేరవేలేదు. దీంతో ఈ విద్యా సంవత్సరం కూడా కాలనీలోని చిన్నారులు ప్రభుత్వ విద్యకు దూరంగానే ఉండే పరిస్థితులు ఉన్నాయి.

గ్రామానికి కాలనీ, విద్యకు చిన్నారులు..

జిన్నారం మండలం గడ్డపోతారం మున్సిపాలిటీలో విలీనమైన కాజీపల్లి గ్రామ పరిధిలో ఉన్న 181 జీఎంఆర్ కాలనీ గ్రామానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉండగా.. ఇక్కడ నివాసముండే కుటుంబాల చిన్నారులు ప్రాథమిక విద్యకు దూరంగా ఉన్నారు. ముఖ్యంగా 2008, 2023లో 181 నంబరులోని ప్రభుత్వ భూముల్లో నిరుపేదలకు ప్రభుత్వం పంపిణీ చేసిన నివాసాల పట్టాలతో ఇళ్లు నిర్మించగా.. ఇక్కడ సుమారు 1,050 వరకు కుటుంబాలు నివాసముంటున్నాయి. కాజీపల్లి గ్రామపంచాయతీ పరిధిలో నగరానికి సమీపంలో ఔటర్ రహదారి సర్వీస్ రోడ్డుకు ఆనుకుని ఈ కాలనీ ఏర్పాటు కాగా.. 17 ఏళ్లలో ఈ కాలనీ జనావాసాలతో నిండి ఉన్నది. ఇక్కడ ఉండే కుటుంబాలకు చెందిన చిన్నారులకు ప్రభుత్వ విద్య దూరభారంలా మారింది. ఇక్కడి నుంచి కాజీపల్లి ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలు మూడు కిలోమీటర్ల దూరంలో ఉండడంతో చిన్నారులు వెళ్లే పరిస్థితి లేదు. అదే విధంగా కాలనీ పక్కనే రంగారెడ్డి, మేడ్చల్ జిల్లా పరిధి కావడంతో అక్కడి పాఠశాలకు వెళ్లే పరిస్థితి లేదు. దీంతో దశాబ్దకాలంగా ఈ కాలనీవాసులు స్థానికంగా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, చిన్నారుల కోసం అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేయాలని అధికారులు. ప్రజా ప్రతినిధులను కోరుతున్నారు. గతేడాది ఈ కాలనీలో పర్యటించిన కలెక్టర్, డీఈవోలు ఇక్కడ ప్రాథమిక పాఠశాల ఏర్పాటుకు సుముఖత వ్యక్తం చేశారు. ప్రతిపాదనలు పంపాలని ఆదేశించగా 181లో ఎకరా స్థలం పాఠశాల కోసం కేటాయించాలని రెవెన్యూ అధికారులు ప్రతిపాదనలు పంపారు. పాఠశాల ఏర్పాటు కోసం మండల విద్యాశాఖ నుంచి కూడా ప్రతిపాదనలు పంపించారు. ఏడాది గడుస్తున్నా స్థలం, పాఠశాల మంజూరీలో ఎలాంటి పురోగతి లేదు.

పాఠశాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాం

కాజీపల్లి కాలనీలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాం. గతేడాది కాలనీలో పర్యటించి పాఠశాల ఏర్పాటుకు తాత్కాలిక భవనం కోసం పరిశీలన చేశాం. కొత్త పాఠశాల ఏర్పాటుకు ప్రభుత్వం నుంచి ఆమోదం రావాల్సి ఉన్నది. ఇక్కడ ప్రాథమిక పాఠశాల ఏర్పాటు కోసం డీఈవోకు మరోసారి నివేదిక అందజేస్తామని ఆయన తెలిపారు.

- కుమారస్వామి, ఎంఈవో

నేడు ఐఐటీహెచ్‌లో జేఈఈ ఓపెన్ డే

కంది, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : జేఈఈ (జాయింట్ ఎంట్రెన్స్ ఎగ్జామ్)లో మంచి ర్యాంకు సాధించి ఐఐటీలలో సీటు పొందాలని ఆశపడే విద్యార్థులకు సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీ హైదరాబాద్‌లో బుధవారం జేఈఈ ఓపెన్ డే-2025 కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇందుకు సంబంధించి మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జేఈఈలో మంచి ర్యాంకు వచ్చి ఇంజనీరింగ్, దాని తర్వాత ఏం చేయాలనే సందేహాలు ఉంటే నివృత్తి చేసుకోవడానికి ఆహ్వానం పలుకుతున్నారు. ఇందులో భాగంగానే బుధవారం ఐఐటీహెచ్ ప్రాంగణంలోని లెక్చరర్స్‌హాల్ కాంప్లెక్స్‌లో ఉదయం 10 గంటల నుంచి ఆఫ్‌లైన్ సెషన్‌లో ప్రత్యక్షంగా జేఈఈ ర్యాంకర్స్‌తో మాట్లాడనున్నారు. ఐఐటీలలో చదవాలనుకునే ఆశావహులకు ఐఐటీలలో ఎందుకు చదవాలి, ప్లేస్‌మెంట్స్ ఎలా ఉంటాయి, ఇంటర్న్‌షిప్‌లు, వినూత్న అవకాశాలు, క్యాంపస్ లైఫ్, ఆవిష్కరణలు, సాంకేతికతలపై ఉన్న అనుమానాలను తీర్చనున్నారు. అలాగే ఈ నెల 5న గురువారం ఉదయం 10 గంటల నుంచి ఐఐటీహెచ్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్ మోడ్‌లో కూడా ఇదే సెషన్‌ను నిర్వహించనున్నారు. మరిన్ని వివరాలకు ఐఐటీహెచ్ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని తెలిపారు.

కార్మికులకు ఉద్యోగ భద్రత అత్యవసరం

● సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్కరాములు



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కరాములు

జహీరాబాద్, జూన్ 3(ఆంధ్రజ్యోతి) :కర్మాగారాల్లో పనిచేసే కార్మికులకు ఉద్యోగభద్రత అత్యవసరమని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కరాములు పేర్కొన్నారు. ఈ నెల 5న మహీంద్ర కర్మాగారంలో కార్మిక సంఘం ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం కార్మికులతో గేట్‌మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు మెరుగైన వేతన ఒప్పందం చేయించిన ఘనత సీఐటీయూ యూనియన్‌కే దక్కిందన్నారు. ఈ నెల 5న జరిగే ఎన్నికల్లో సీఐటీయూ యూనియన్ చక్క గుర్తుకు ఓటేసి తనను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా మెనిఫెస్టోను విడుదల చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు మల్లేశం, రాంచందర్, ఆయా పరిశ్రమల నాయకులు బాగారెడ్డి, పాండురంగారెడ్డి, మైపాల్, రాజీరెడ్డి, కనకరెడ్డి, గణేష్, నర్సయ్య, నారాయణ, సందీప్‌రెడ్డి, నరేష్, మణి, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

● టీఎంయూ రాష్ట్ర అధ్యక్షుడు అశ్వత్థామరెడ్డి


ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న అశ్వత్థామరెడ్డి

పాపన్నపేట, జూన్ 3(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని టీఎంయూ వ్యవస్థాపక అధ్యక్షుడు, రాష్ట్ర నాయకుడు అశ్వత్థామరెడ్డి అన్నారు. మంగళవారం ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయల ఆలయం వద్ద నిర్వహించిన ఆర్టీసీ కార్మికుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆర్టీసీ కార్మికులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారన్నారు. ప్రభుత్వంపై నమ్మకంతోనే సమ్మెను విరమించామని, వెంటనే బకాయిలు చెల్లించాలన్నారు. కార్మికుల సమస్యల పట్ల పోరాటం చేయడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామన్నారు. ప్రభుత్వంపై తమకు పూర్తి విశ్వాసం ఉందని ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. యూనియన్ నాయకులు ఎంఆర్కే రావు, శాకన్న, ఆశ్ఫక్, వెంకన్న, నర్సింహులు, ముత్యం, సంగమేశ్వర్, శంకర్, సందీప, జ్యోతి, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల దారి.. పట్టించుకునేవారేరీ?

- సూచిక బోర్డులు లేవు.. స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయరు
- హుస్నాబాద్ పట్టణ స్థూపం ఏనే వద్ద నిత్యం ప్రమాదాలు




లారీ ఢీ కొట్టడంతో బోల్తా పడిన ట్రాక్టర్, హుస్నాబాద్ పట్టణంలోని ఏనే వద్ద ప్రమాదాలు జరిగే రహదారి

హుస్నాబాద్ టౌన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్- జనగామ రహదారిలోని అమరవీరుల స్థూపం ఏనే వద్ద వాహనదారులు నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. ఇక్కడ మూడు రహదారులు ఉండటం, సూచిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయకపోవడంతో ఈ ప్రమాదాలు జరుగుతున్నాయి. వాహనాలతో ఈ రోడ్డు నిత్యం రద్దీగా ఉంటుంది. పట్టణ శివారులోని ఏనే వద్ద అటు నుంచి వచ్చే వాహనాలు ఎత్తు నుంచి కిందకు అతి వేగంగా వస్తుంటాయి. ఏనే కిందనే బైపాస్ రోడ్డు ఉండగా ఇక్కడ నుంచి కూడా వాహనాల రద్దీ ఎక్కువగానే ఉంటుంది. ఇటు నుంచి వెళ్లే వాహనదారులకు ఏనే పైనుంచి వచ్చే వాహనాలు కనిపించకుండా అవి స్పీడ్‌గా వస్తుండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఐదు రోజుల క్రితం పై నుంచి వచ్చే లారీ కింద నుంచి పైకి వెళ్తున్న ట్రాక్టర్‌ను ఢీకొట్టడంతో నలుగురు కూలీలతో పాటు బస్సు కోసం అక్కడ వేచి ఉన్న ఇరువురికి తీవ్రమైన గాయాలయ్యాయి. ఇలా ప్రతి రోజు ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాదాలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని ఆర్అండ్‌బీ అధికారులను కోరుతున్నా పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. రామవరం బైపాస్ రోడ్డు వద్ద స్పీడ్ బ్రేకర్, ఏనే పైన స్థూపం వద్ద స్పీడ్ బ్రేకర్లతో పాటు సూచికబోర్డులు ఏర్పాటు చేస్తే ప్రమాదాలు నివారించవచ్చని ప్రజలు పేర్కొంటున్నారు.

సతీష్‌కుమార్ ఆరోపణలు సత్యదూరం

హుస్నాబాద్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌పై సత్యదూరమైన ఆరోపణలు చేసి చులకన కావద్దని మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్‌కు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి సూచించారు. మంగళవారం ఆయన పొన్నం ప్రభాకర్‌పై సతీష్‌కుమార్ చేసిన ఆరోపణలను ఖండించారు. మెడికల్ కాలేజీ ప్రకటన చేసింది ప్రియాంక గాంధీ అనేది తెలుసుకోవాలన్నారు. ఎన్నికల ముందు మెడికల్ కాలేజీ తెస్తానని మంత్రి చెప్పలేదని, అయినా మీ పార్టీతో చీకటి ఒప్పందం ఉన్నా మీ వాళ్లు (బీజేపీ) ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువ వికాస పథకంలో పారదర్శకత పాటిస్తున్నామని, మీ ప్రభుత్వంలో దళిత బంధు మీ వాళ్లకే ఇప్పించుకున్న విషయాన్ని మరచిపోవద్దన్నారు. మీ హయాంలో నాణ్యత లేకుండా కోట్ల రూపాయల విలువైన సీసీ రోడ్డు వేశారని, పాలిటెక్నిక్ కళాశాల, ఐఓసీ దూరంగా నిర్మించడంతో ప్రజలు తీవ్రమై ఇబ్బందులు పడుతున్నారన్నారు. జిల్లాలో మూడు ప్రాజెక్టులు పూర్తయినా గౌరవెల్లి ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ గెలిచిన కొద్ది కాలంలోనే ఎన్నో అభివృద్ధి పనులు చేస్తుంటే చూసి ఓర్వలేక అవాస్తవమైన ఆరోపణలు చేస్తున్నారన్నారు.

దాడి చేసిన ముగ్గురిపై కేసు

మద్దూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : ధూళిమిట్ట మండలం బైరాన్‌పల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ బండి శ్రీనివాస్‌పై దాడిచేసిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై షేక్ మహబూబ్ అలీ తెలిపారు. ఈ విషయమై ఎస్సై తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఇదే బైరాన్‌పల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అద్దెకు తీసుకున్న షట్టరు లీజ్ అయిపోవడంతో షాపు యాజమాని షాపు ఖాళీ చేయాలని ఇంటికి వెళ్లి ఒత్తిడి చేయడంతో మాటామాటా పెరిగి ఇరువురు దూషించుకున్నారు. ఈ విషయమై మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు బండి శ్రీనివాస్ తమ ఇంటిమీదకు పంపించాడని కక్ష పెంచుకున్న కుటుంబ సభ్యులు బండి శ్రీనివాస్‌పై దాడికి పాల్పడ్డారని తెలిపారు. ఈ విషయమై బండి శ్రీనివాస్ చేసిన ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసి దూళిమిట్ట తహసీల్దారు మధుసూదన్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

న్యూస్ బాక్స్

రియల్‌మాఫియా చెరలో మోతే వంజరికుంట

మిరుదొడ్డి, జూన్3 (ఆంధ్రజ్యోతి): అక్బర్‌పేట-భూంపల్లి మండలం మోతే గ్రామంలోని వంజరికుంట చెరువు భూమిని కొంత మంది రియల్ఎస్టేట్‌వ్యాపారులు ఆక్రమించారంటూ మంగళవారం ఆగ్రామ మాజీ సర్పంచ్ కాలేరు శ్రీనివాస్ ఆందోళన చేపట్టారు. గ్రామంలోని వంజరికుంట సమీపంలో భువనగిరికి చెందిన రియల్ఎస్టేట్ వ్యాపారి 40 ఎకరాల భూమిని కొనుగోలు చేశారన్నారు. దానికి సమీపంలోని మూడెకరాల ప్రభుత్వభూమితోపాటు వంజరికుంటలో కంచె వేసి, కబ్జాచేశారన్నారు. తన భూమి కూడా ఉందని ఆగ్రామ మాజీ సర్పంచు కాలేరు శ్రీనివాస్ తెలిపారు. విలువైన భూమిని, చెరువును కాపాడాలంటూ వారు అక్బర్‌పేట-భూంపల్లి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

మల్లన్న ఆలయభూమి కబ్జాకు యత్నం



ఎక్స్‌కవేటర్‌తో మండపాలను తొలగింపజేస్తున్నఆలయవర్గాలు

చేర్యాల, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి మల్లికార్జునస్వామి దేవాలయ భూమిని స్థానికులు అన్యాక్రాంతానికి యత్నించడం కలకలం రేపింది. గ్రామశివారులోని పీహెచ్‌సీ సమీపంలో గుట్టచుట్టూ ఆలయభూమి నిరుపయోగంగా ఉంది. అదేప్రదేశానికి సమీపంలో బుడిగ జంగాల కాలనీవాసులు నివసిస్తున్నారు. దీంతో వారి కులదైవాల గుడినిర్మాణం చేపట్టాలని నిర్ణయించి సోమవారం రాత్రికి రాత్రే ఆలయ భూమిలో పూజలు చేసి శాబాది బండలతో చిరు గుళ్లను ఏర్పాటు చేశారు. ఈవిషయం తెలిసిన స్థానికులు ఆలయాధికారులకు తెలియజేశారు. దీంతో ఆలయాధికారులు పోలీసులకు తెలపడంతో ఎస్సై రాజు, ఏఈవో శ్రీనివాస్, సూపరింటెండెంట్ శ్రీరాములు, ప్లంబర్ విజయ్‌కుమార్‌లు సిబ్బందితో కలిసి సంబంధిత ప్రదేశానికి చేరుకున్నారు. ఎక్స్‌కావేటర్ తో షాబాదిబండలతో ఏర్పాటుచేసిన చిరుమండపాలను తొలగించారు. ఆలయభూమిని ఆక్రమిస్తే చర్యలు తప్పవని తెలిపారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ



బాధిత కుటుంబానికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేస్తున్న మల్లారెడ్డి

తొగుట, జూన్ 3(ఆంధ్రజ్యోతి): తొగుట మండలం జప్తిలింగారెడ్డిపల్లి గ్రామంలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి సహకారంతో నీల పోచవ్వకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును మంగళవారం బాధిత కుటుంబానికి బీఆర్ఎస్ మండల పార్టీ మాజీ అధ్యక్షుడు చిలివేరి మల్లారెడ్డి అందజేశారు.

అధికారుల సూచనల మేరకే పంటల సాగు ..

అక్కన్నపేట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ అధికారుల సూచన మేరకు పంటలు సాగు చేసుకోవాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు రమేష్ నాయక్, శివరమనేలు రైతులకు సూచించారు. మంగళవారం అక్కన్నపేట మండలంలోని రామవరం రైతు వేదికలో వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పంటల సాగుపై అవగాహన కల్పించారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు పథకాల గురించి వివరించారు.

పీసీసీ అధ్యక్షుడిని కలిసిన నాగపురి

చేర్యాల, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్‌ను చేర్యాల పట్టణానికి చెందిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నాగపురి కిరణ్‌కుమార్‌గౌడ్ మంగళవారం హైదరాబాదులో మర్యాదపూర్వకంగా కలిశారు.

ఉప్పొంగిన అభిమానం

న్యూస్‌నెట్‌వర్క్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు మండలాల్లో మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు జన్మదిన వేడుకలు అట్టహాసంగా జరిగాయి. అభిమాన నాయకుడి పుట్టినరోజు సందర్భంగా పలు సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టి పార్టీ శ్రేణులు, అభిమానులు తమ అభిమానాన్ని చాటుకున్నారు. సిద్దిపేట క్యాంప్ కార్యాలయం అన్నదాన కార్యక్రమం, అతిక్ ఫౌండేషన్, బీఆర్ఆర్ ఫౌండేషన్, బీఆర్ఎస్ నాయకుడు నాయకం వెంకటేష్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రి వద్ద, పట్టణ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కొండం సంపత్ రెడ్డి ఆధ్వర్యంలో కాళ్ళ కుంట కాలనీ, పాత బస్టాండ్, నర్సాపూర్ చౌరస్తా, అయిత పురుషోత్తం ఆధ్వర్యంలో బురుజు వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గజ్వేల్ పట్టణంతో పాటు మండల వ్యాప్తంగా మాజీ మంత్రి, సిద్దిపేట శాసనసభ్యులు తన్నీరు హరీశ్‌రావు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. మాజీమంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు జన్మదిన వేడుకలను మంగళవారం నంగునూరు మండలంలో బీఆర్ఎస్ శ్రేణులు ఘనంగా జరుపుకున్నారు. మర్కుక్‌లో హరీష్‌రావు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావుకు హైదరాబాద్‌లో మండల కేంద్రమైన ములుగుకు చెందిన మైనార్టీ రాష్ట్ర యువత విభాగం ఉపాధ్యక్షులు జుబేర్, అర్జున్‌గౌడ్, నవీన్‌లు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు జన్మదిన వేడుకలను కొండపాక మండలంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మండలంలోని దుద్దెడ, వెలికట్ట క్రాస్ రోడ్డు వద్ద కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పుట్టిన రోజు సందర్భంగా మంగళవారం చిన్నకోడూరు మండలంలోని పలు గ్రామాల్లోని ఆలయాల్లో బీఆర్ఎస్ నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. చెర్లఅంకిరెడ్డిపల్లి శివారులోని వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. చిన్నకోడూరులోని అంబేడ్కర్ చౌరస్తాలో కేక్ కట్ చేశారు. బెజ్జంకిలో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు జన్మదిన వేడుకలను మంగళవారం బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పాకాల మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు.

హరీశ్‌రావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మోయిద్‌ఖాన్, మాజీ ఎమ్మెల్యే



హరీశ్‌రావుకి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న మైనార్టీ నాయకుడు మోయిద్‌ఖాన్, మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు జన్మదినాన్ని పురస్కరించుకొని మంగళవారం మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డితో కలిసి మైనార్టీ సెల్ రాష్ట్ర నాయకులు మోయిద్‌ఖాన్ హైదరాబాద్‌లోని ఆయన నివాస గృహంలో శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీష్‌రావుకు వారు పుష్పగుచ్ఛం అందించారు.

మండల అభివృద్ధికి కృషి చేస్తున్న కేంద్ర మంత్రి సంజయ్



గండిపల్లిలో బోరు మోటర్ ప్రారంభిస్తున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి

అక్కన్నపేట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): అక్కన్నపేట మండల అభివృద్ధికి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కృషి చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి అన్నారు. మంగళవారం అక్కన్నపేట మండల కేంద్రంలోని శివాలయం వద్ద కేంద్రమంత్రి మంజూరు చేసిన హైమాస్ లైట్లు, గండిపల్లి గ్రామంలో బోరు మోటారును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన తండాలు అధికంగా ఉన్న అక్కన్నపేట మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కేంద్రమంత్రి సంజయ్ నిధులు మంజూరు చేస్తున్నారన్నారు. గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు బోర్లు మంజూరు చేస్తున్నారని తెలిపారు. సీసీ రోడ్లు, డ్రైనేజ్‌ల నిర్మాణానికి నిధులు ఇస్తున్నారని పేర్కొన్నారు. మండల అభివృద్ధికి కృషి చేస్తున్న కేంద్ర మంత్రి బండి సంజయ్‌కి కృతజ్ఞతలు తెలిపారు. ఇందులో బీజేపీ మండల అధ్యక్షులు రామంచ మహేందర్ రెడ్డి, అసెంబ్లీ కో కన్వీనర్ జనగామ వేణుగోపాలరావు, నాయకులు చెరుకు సంపత్, నునావత్ మోహన్‌నాయక్, వంగపల్లి సాగర్, తదితరులున్నారు.

సిద్దిపేట బంద్ ప్రశాంతం

- స్వచ్ఛందంగా బంద్ చేసిన వ్యాపారస్థులు
- పట్టణంలో పర్యటించిన సీపీ డాక్టర్ బి అనురాధ



ర్యాలీ నిర్వహిస్తున్న హిందూ సంఘాల నాయకులు

సిద్దిపేట క్రైం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): విశ్వ హిందూ పరిషత్, గోరక్షణ నాయకుని పై ఓ వర్గం చేసిన అమానుష దాడికి నిరసనగా సిద్దిపేట పట్టణంలో మంగళవారం రెండవ రోజు వ్యాపార సంస్థలు స్వచ్ఛందంగా బంద్ పాటించారు. బంద్‌కు మద్దతుగా హిందూ సంఘాల నాయకులు పట్టణంలోనీ పుర విధుల గుండా తిరుగుతూ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హిందూ సంఘాల నాయకులు మాట్లాడుతూ గో రక్షణ నాయకులపై చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని, దాడి చేసినా దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సిద్దిపేట పోలీస్ కమిషనర్ డాక్టర్ బి అనురాధ సిద్దిపేట జిల్లా కేంద్రంలో ప్రతి ఏరియాను సందర్శించారు. సోషల్ మీడియాలో వచ్చే పుకార్లను నమ్మవద్దని ఏది నిజం ఏది అబద్ధం ముందుగా తెలుసుకోవాలని ప్రజలకు సూచించారు. బక్రీద్ పండుగ సందర్భంగా పశువుల అక్రమ రవాణా నియంత్రణకు రంగధాంపల్లి చౌరస్తాలో చెక్ పోస్టును సిపి డాక్టర్ బి అనురాధ తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట ఏసిపి రవీందర్ రెడ్డి, ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ కుమార్, మహిళ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ దుర్గ, ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీధర్ గౌడ్, పోలీస్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

కొమురవెల్లి,జూన్03(ఆంధ్రజ్యోతి):మండలంలోని లెనిన్‌నగర్ గ్రామానికి చెందిన చిన్న నర్సయ్య సోమవారం మరణించిన విషయం తెలుసుకున్న బీఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బొంగు రాజేందర్‌రెడ్డి మంగళవారం లెనిన్‌నగర్‌కు వెళ్ళి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఆయన వెంట పలువురు నాయకులు ఉన్నారు.

రైతు సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

ములుగు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): గ్రామాలలో రైతుల సమస్యలు పరిష్కరించడం కోసమే రాష్ట్ర ప్రభుత్వం రైతు సదస్సులు నిర్వహించడానికి ముందుకు వచ్చిందని గజ్వేల్ ఆర్డీవో చంద్రకళ పేర్కొన్నారు. మంగళవారం ములుగు మండల పరిధిలోని క్షీరసాగర్, బండతిమ్మాపూర్ గ్రామాలలో రైతు సదస్సులు నిర్వహించారు. ఆర్డీఓ చంద్రకళ, తహసీల్దార్ ఆరిఫా క్షీరాసాగర్ గ్రామంలోని రైతు సదస్సులో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను రైతు సదస్సు ద్వారా సమస్యలు పరిష్కరించవచ్చన్నారు. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా సమస్యలు పరిష్కరించడానికి రెవెన్యూ యంత్రాంగం మీ ముందుకు వచ్చిందన్నారు. ఈ కార్యక్రమాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

ఆలయ కమిటీ చైర్మన్‌గా రఘుపతిరావు



రఘుపతిరావును సన్మానిస్తున్న గ్రామస్థులు

తొగుట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): తొగుట మండలం వెంకట్రావ్‌పేట గ్రామంలోని శ్రీ వేణుగోపాల స్వామి ఆలయ కమిటి చైర్మన్‌గా రాయరవు రఘుపతిరావును మంగళవారం గ్రామస్తులు ఎన్నుకున్నారు. అదే విధంగా వైస్ చైర్మన్‌గా తడ్కమడ్ల రాజయ్య, కార్యదర్శులుగా కంకణాల నర్సింహులు జీడిపల్లి రాంరెడ్డి, సహాయ కార్యదర్శిగా బండకాడి సత్యనారాయణ గౌడ్, కోశాధికారిగా డబ్బికారి పెంటోజీలను ఎన్నికయ్యారు, ఈ సందర్భంగా నూతనంగా చైర్మన్‌గా ఎన్నికైన రఘుపతిరావును గ్రామస్తులు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.

రెవెన్యూ సదస్సులను పక్కాగా నిర్వహించాలి

సిద్దిపేట రూరల్, జూన్ 3(ఆంధ్రజ్యోతి):రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా చేపట్టిన భూ భారతి కొత్త అర్వోఆర్ చట్టం కింద గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను పకడ్బందీగా నిర్వహించాలని ఆర్డీఓ సదానందం సిబ్బందికి సూచించారు. మంగళవారం సిద్దిపేట రూరల్ మండలం ఇర్కోడులో, నారాయణరావుపేట మండలం కేంద్రంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించగ ఇర్కోడు రెవెన్యూ సదస్సును ఆర్డీఓ సందర్శించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఇర్కోడు రెవెన్యూ సదస్సులో 100, నారాణయరావుపేట రెవిన్యూ సదస్సులో 108 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు.

అనాథ చిన్నారులకు ఆర్థిక సహాయం



తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలకు రూ.53వేల ఆర్థిక సహాయం అందజేస్తున్న నాయకులు

గజ్వేల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులకు మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు జన్మదినం సందర్భంగా ఏఎంసీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ అండగా నిలిచారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్అండ్ఆర్ కాలనీలో నివాసం ఉంటున్న గూడూరి రమేశ్ ఇటీవల మృతిచెందగా, ఆయన భార్య పద్మ కొన్ని రోజుల క్రితం మృతిచెందింది. ఆయనకు ఇద్దరు కుమారులు పవన్, వరుణ్, తల్లి ఉన్నారు. వారు అనాథలుగా మారడంతో ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరి యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డిల చేతుల మీదుగా ఏఎంసీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ హరీశ్‌రావు 53వ జన్మదినం సందర్భంగా రూ.53వేలను అందజేశారు.

వాహనం ఢీకొని.. వ్యక్తికి తీవ్ర గాయాలు

గజ్వేల్ రూరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తికి తీవ్రమైన గాయాలు అయ్యాయి. ఈ సంఘటన ప్రజ్ఞాపూర్ రాజీవ్ రహదారిపై జరిగింది. గజ్వేల్ సీఐ సైదా తెలిపిన వివరాల ప్రకారం ప్రజ్ఞాపూర్‌లోని కిచెన్ హోటల్ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియని వక్తికి తీవ్ర గాయాలు కాగా అక్కడి గజ్వేల్ పోలీసులు వెళ్లి అంబులెన్స్‌లో గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్నారు అని పోలీసులు తెలిపారు. సుమారు 45 సంవత్సరాలు వయస్సు ఉండి చామను చాయ కలర్, తెలుపు రంగు పాయింట్, నలుపు రంగు షర్టు ధరించి ఉన్నారు. ఎవరైనా గుర్తు పడితే 100కి కానీ గజ్వేల్ పోలీసులకు సమాచారం అందించాలని గజ్వేల్ సీఐ సైద తెలిపారు.

నిబంధనల పేరుతో కొర్రీలు పెట్టొద్దు

● ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు రాజ్‌కుమార్

హుస్నాబాద్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : రాజీవ్ యువ వికాస పథకంలో నిబంధనల పేరుతో కొర్రీలు పెట్టవద్దని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు జనగామ రాజ్‌కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం ఆయన హుస్నాబాద్‌లో విలేకరులతో మాట్లాడారు. ఈ పథకానికి రాష్ట్రంలో 16.25 లక్షల మంది నిరుద్యోగ యువకులు దరఖాస్తు చేసుకున్నారని, ఇప్పుడు నిబంధనలను తెరపైకి తేవడం సరికాదన్నారు. లక్షల మంది యువత ఈ పథకం కోసం ఎదురుచూస్తున్నారని, ఎలాంటి ఆంక్షలు లేకుండా అందరికీ ఈ స్కీమ్‌ను వర్తింపజేయాలని డిమాండ్ చేశారు.

యువత సన్మార్గంలో నడవాలి



యువజన సంఘాల సభ్యులతో మాట్లాడుతూన్న సీఐ శ్రీను

బెజ్జంకి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) :యువత నిర్దేశిత లక్ష్యాలను సాధించేందుకు, పట్టుదలతో శ్రమించాలని చెడు అలవాట్లు వ్యసనాలకు దూరంగా ఉండాలని సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను అన్నారు. మంగళవారం బెజ్జంకి పోలీసు స్టేషన్‌ను ఆయన సందర్శించి మండలంలోని పలు గ్రామాల యువజన సంఘం సభ్యులతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సోషల్ మీడియా మోజులో పడవద్దని, సోషల్ మీడియాను విజ్ఞానికి వినియోగించుకావాలే తప్ప పక్కదారి పట్టేందుకు కాదని తెలిపారు.

భూసమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు



అల్లిరాజపేట గ్రామంలో రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ నిర్మల.

న్యూస్‌నెట్‌వర్క్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు చోట్ల మంగళవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. భూ సమస్యల పరిష్కారమే భూభారతి లక్ష్యమని జగదేవ్‌పూర్ తహసీల్దార్ నిర్మల పేర్కొన్నారు. రాయపోల్ మండలంలో భూభారతి రెవెన్యూ సదస్సులు మంగళవారం ప్రారంభమయ్యాయి. మండలంలోని చిన్నమాసాన్‌పల్లి గ్రామంలో తహసీల్దార్ కృష్ణమోహన్, సీనియర్ అసిస్టెంట్ నాగరాజు ఆధ్వర్యంలో రైతుల నుండి సమస్యల దరఖాస్తులు సేకరించారు. భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు మద్దూరు, దూళిమిట్ట తహసీల్దార్లు ఎజీ రహీం, మధుసూదన్ తెలిపారు. మంగళవారం మద్దూరు మండలంలోని సలాఖ్‌పూర్, దూళిమిట్ట మండల కేంద్రంలో భూ భారతి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. మంగళవారం తొగుట మండలం లింగాపూర్, ఘనపూర్ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. గ్రామాల్లో రైతుల భూ సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం భూ భారతీ చట్టం ద్వారా భూ సమస్యలను పరిష్కరించేందుకు రెవెన్యూ సదస్సులను గ్రామాల వారిగా నిర్వహిస్తున్నట్లు హుస్నాబాద్ ఆర్డీవో రాంమూర్తి పేర్కొన్నారు. కొండపాక మండలం రాంపల్లిలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ గ్రామస్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. భూభారతి రెవిన్యూ సదస్సుల్లో భాగంగా మండలంలోని పోసాన్‌పల్లి గ్రామంలో మంగళవారం తహసీల్దార్ జి.దివ్య అధ్వర్యంలో రెవిన్యూ సదస్సు నిర్వహించారు. రైతు, భూ సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం రెవిన్యూ సద స్సులు నిర్వహిస్తుందని సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ అన్నారు.

ఎడ్లు లేని ఎవుసం..

(5వ పేజీ తరువాయి..)

అధికారులు పేర్కొంటున్నారు. 2019 లెక్కల ప్రకారం ఆవులు, ఎడ్లు, లేగదూడలు 53,767 ఉండగా గేదెలు, దున్నపోతులు, దుడ్డెలు 83,736 ఉన్నాయి. హుస్నాబాద్ డివిజన్‌లోని హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ, బెజ్జంకి మండలాల్లో ఆవులు, ఎడ్లు, లేగదూడలు 9,063, గేదెలు, దున్నపోతులు 12,439 ఉన్నాయి. ఇది కరువు ప్రాంతం కావడంతో పశుపోషణ భారమై రైతులు కబేళాలకు తరలిస్తుండటంతో వీటి సంఖ్య చాలా వరకు తగ్గిపోతుందని అధికారులు పేర్కొంటున్నారు.

హుస్నాబాద్ సంత నుంచి ప్రతి వారం 400 పశువులు కబేళాలకు..

తెలంగాణలో ఉన్న పశువుల సంతల్లో హుస్నాబాద్ సంత ప్రముఖమైనది. ప్రతీ శుక్రవారం జరిగే హుస్నాబాద్ సంత నుంచి దాదాపుగా 250 నుంచి 400 వరకు పశువులు హైదరాబాద్, సిద్దిపేట వంటి పట్టణాల కబేళాలకు తరలుతుంటాయి. ముఖ్యంగా ముసలి ఎడ్లు, దూడలు, దుడ్డెలు, బక్కచిక్కిన ఆవులను కబేళాలకు తరలిస్తుంటారు. పశుగ్రాసం లేకపోవడం, పోషణభారం కావడంతో మెట్ట రైతులు తప్పని పరిస్థితుల్లో కబేళాలకు విక్రయిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న పశువధ నియంత్రణ నిర్ణయంతో కబేళాలకు తరలించడం తగ్గిపోతుంది. కాని అక్కరకు రాని పశువులను ఎలా సంరక్షించాలన్న దానిపై రైతులు ఆందోళన చెందుతున్నారు.

ప్రభుత్వాలు ప్రోత్సహించాలి..

ఎడ్లజాతిని కాపాడుకునేందుకు ప్రభుత్వాలు రైతులను ప్రోత్సహించాలి. గతంలో ఎడ్ల కొనుగోలుకు ప్రభుత్వాలు సాయం అందించేవి. సన్న చిన్నకారు రైతులకు సబ్సిడీపై పంపిణీ చేసేవి. బ్యాంకులు కూడా ఎడ్లకు రుణాలు ఇచ్చేవి. ఇప్పుడు ట్రాక్టర్లకు, యంత్రాలకు సబ్సిడీపై రైతులకు అందిస్తున్నారు. ప్రస్తుతం ప్రభుత్వాలు చొరవ తీసుకొని ఆవులు, గేదెలతో పాటు ఎడ్లను పెంచే రైతులను ప్రోత్సహించేందుకు రుణాలు ఇవ్వాలి. పశుగ్రాసం అందించాలి. అప్పుడే ఎడ్లజాతిని రక్షించుకోగలుగుతాం.